క్లుప్తంగా

పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య సేవలు



రైటర్ ఆలీషాకు వినికిడి పరీక్ష చేస్తున్న వైద్యుడు శ్రీను నాయక్. చిత్రంలో ఎస్సై షరీఫ్

కాకినాడ రూరల్: తిమ్మాపురం పోలీసు స్టేషన్‌లో సిబ్బందికి సర్పవరం జంక్షన్‌కులోని స్వాతి స్పీచ్ అండ్ హియరింగ్ కేర్ సెంటర్, ఎపెక్స్ ఈఎన్‌టీ ఆస్పత్రి వైద్య సిబ్బంది శనివారం ఉచిత వైద్య సేవలందించారు. శిబిరాన్ని ఎస్సై షరీఫ్ ప్రారంభించారు. ఆయన వినికిడి పరీక్షలు చేయించుకుని, సిబ్బందికి చేయించారు. వైద్యుడు శ్రీను నాయక్ వినికిడి పరీక్షలతో పాటు వినికిడి మిషన్ ట్రయల్స్ నిర్వహించారు. ఎపెక్స్ ఈఎన్‌టీ వైద్యుడు కందుల శ్రీనివాస్ చెవి, ముక్కు, గొంతు సంబంధిత పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

కాకినాడ లీగల్: వచ్చే నెల 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ పి.కమలాదేవి అన్నారు. శనివారం కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఎక్సైజ్ పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి కమలాదేవి మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

జగనన్న నిర్ణయంపై జర్నలిస్టు సంఘాల హర్షం



ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని సత్కరిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై జర్నలిస్టుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. క్యాబినెట్ ఆమోదంపై ఏపీడబ్ల్యూజేఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. కలెక్టరేట్ వద్ద ఫెడరేషన్ నాయకులు శనివారం జర్నలిస్టులకు, కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులకు, ఉద్యోగులకు స్వీట్స్ పంపిణీ చేశారు. సంఘం నాయకులు వాతాడ నవీన్‌రాజ్, లక్ష్మణ్ మాట్లాడారు. ఇళ్ల స్థలాల మంజూరు నిర్ణయానికి కృతజ్ఞతగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని ఆయన గృహంలో జర్నలిస్టు నాయకులు అల్లుమల్లు ఏలియా, ఏలియా, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యులు షేక్ సలీమ్, వాసంశెట్టి సూరిబాబు, వారణాసి శ్రీనివాసరావు, సత్తిబాబు తదితరులు కలసి సత్కరించారు. జిల్లా జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మంగా వెంకట శివరామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అన్నదానం మిన్న

బోట్‌క్లబ్: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని నూకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో అడబాల శ్రీరామ్ ఏర్పాటు చేసిన అయ్యప్పస్వాములు భిక్షను శనివారం ప్రారంభించారు. మూడేళ్లుగా అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం అభినందనీయమని అడబాలను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే సతీమణి మహాలక్ష్మి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా మాజీ చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర విద్యాసాగర్, ఎస్వీ సాయిబాబా పాల్గొన్నారు.

సెప్టిక్ వ్యర్థాలపై నిర్లక్ష్యం వద్దు

కాకినాడ: సెప్టిక్ వ్యర్థాల తొలగింపు, తరలింపులో నిబంధనలు కచ్చితంగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం సెప్టిక్ ట్యాంకుల నిర్వాహకులతో కమిషనర్ సమావేశం ఏర్పాటు మాట్లాడుతూ సెప్టిక్ వ్యర్థాలను తొలగించే సమయంలో పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) కిట్లను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. నిర్దేశించిన యూనిఫామ్‌తో పాటు గమ్ బూట్లు, మాస్కులు, గ్లౌజులు విధిగా వాడాలన్నారు. వ్యర్థాలను నిర్దేశించిన సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రాంతాలలో మాత్రమే డంప్ చేయాలని, వాహనాలను ఎంపిక చేసిన ప్రాంతంలో మాత్రమే నిలపాలని, లేకుంటే జరిమానాలు, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

14420కు కాల్ చేయండి

నగర పరిధిలో సెప్టిక్ ట్యాంకులు అవసరమైతే టోల్ ఫ్రీ నెంబర్ 14420కు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు. మరో వారం రోజుల్లో ఆ నెంబర్ అందుబాటులోకి వస్తుందని, నగరంలోని సెప్టిక్ ట్యాంకుల నిర్వహణ కార్పొరేషన్ పర్యవేక్షణలోనే జరుగుతుందని, నిర్దేశించిన సొమ్ము చెల్లించి టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే సేవలు అందుతాయన్నారు. ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, శానిటరీ సూపర్‌వైజర్లు జిలాని, రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లాజర్, సెప్టిక్ ట్యాంకుల నిర్వాహకులు పాల్గొన్నారు.

మార్గం సుగమం

- ముమ్మరంగా చెట్ల కొమ్మల తొలగింపు
- జేఎన్‌టీయూకే మార్గంలో సురక్షిత ప్రయాణం
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వ శాఖల కసరత్తు

కాకినాడ క్రైం: నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. కొద్ది రోజులుగా నగరంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న చెట్లు కొమ్మలను తొలగిస్తూ వాహనాల రాకపోకలకు అనుకూలంగా చేస్తున్నారు. వరుస పర్వదినాలు, పండుగల నేపథ్యంలో రద్దీ పెరగనుండగా అధికారుల చర్యలు సామాన్య ప్రజలు, ప్రయాణికులకు సంతోషం కలిగిస్తున్నాయి.

నగరంలోనే ప్రధాన మార్గం

నగరం గుండా వెళ్లాల్సిన భారీ వాహనాలకు అచ్చంపేట కూడలి నుంచి భానుగుడి జంక్షన్ వరకు ఉన్న ఏకైక మార్గం ఏపీఎస్పీ–సర్పవరం–జేఎన్‌టీయూకే రహదారి. ఇది నగరంలోనే అత్యంత ప్రధాన మార్గం. ఎస్పీ కార్యాలయం, రంగరాయ వైద్య కళాశాల, జేఎన్‌టీయూకే, ప్రధాన దేవాలయాలు, కేన్సర్ ఆసుపత్రి, పార్కు, ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ఆర్‌ఎంసీ ఆడిటోరియం, వ్యాపార, నివాస సముదాయాలు కలగలిపి ఉన్న మార్గం ఇది. ఈ రహదారిని క్రమబద్ధీకరిస్తే ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు నియంత్రించవచ్చు. ఈ క్రమంలో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. వాలుగా పెరిగి రహదారుల మీదకు విస్తరిస్తున్న చెట్ల కొమ్మలను మున్సిపల్ సిబ్బంది తొలగిస్తున్నారు.

భానుగుడి వరకు...

కాకినాడ నాగమల్లి తోట కూడలి నుంచి జేఎన్‌టీయూకే రహదారి మొత్తం నగరంలో అత్యంత రద్దీ మార్గాల్లో ప్రధానమైనది. కొన్ని లక్షల వాహనాలు నిత్యం అటుగా పయనిస్తుంటాయి. అయితే గతంలో ఆహ్లాదం, పర్యావరణ ప్రాధాన్యాన్ని పరిగణించి వేసిన మొక్కలు భారీ వృక్షాలు అయ్యాయి. వాటి కొమ్మలు అటుగా వెళుతున్న భారీ వాహనాలకు అడ్డంకిగా మారాయి. పలుమార్లు కొమ్మలు తగిలిన వాహనాలు అదుపుతప్పాయి. అలాగే చెట్ల నుంచి వంగి రహదారి మీదకు వాలుతున్న చెట్టు కొమ్మలు వాహన ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో రహదారి భవనాలు, ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో ఉద్యానవన మున్సిపల్ విభాగం అనుమతులతో రహదారులపై వేలాడుతున్న కొమ్మలను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. వారం రోజులుగా చేపడుతున్న ఈ చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి.



విశాలంగా కనపడుతున్న స్మార్ట్ రోడ్డు

ప్రమాదాల నివారణకు ఊతం



ఎన్నో ప్రమాదాల నివారణకు ఈ చర్యలు ఉపయుక్తం. పోలీస్ శాఖ నుంచి అనేకసార్లు పెరిగిన కొమ్మల తొలగింపునకు ప్రతిపాదించాం. ఎట్టకేలకు ఉద్యానవన ఉన్నతాధికారి ఆదేశాలతో తొలగిస్తున్నారు. రోడ్లు విశాలంగా మారాయి. బస్సులు సహా భారీ వాహనాలన్నీ రోడ్డు మధ్యలో కాక, చిన్న వాహనదారులకు అనుకూలంగా ప్రయాణిస్తున్నాయి. ఆర్ఎంసీ ప్రధాన ద్వారానికి సమీపించే మార్గంలో మరో భారీ వృక్షం ఒరిగిపోవడానికి సిద్ధంగా ఉంది. తొలగింపు అంశాన్ని పరిగణించాలి. ఎందరో బస్సుల డ్రైవర్లు బస్సుల పై భాగానికి ఆ చెట్టు కొమ్మలు భారీగా తగులుతున్నాయని ఫిర్యాదు చేశారు.
– డీఎస్ చైతన్యకృష్ణ, సీఐ, కాకినాడ ట్రాఫిక్–2

స్మార్ట్ రోడ్డు



గతేడాది స్మార్ట్ రోడ్డుగా ఎంపికైన నేపథ్యంలో జేఎన్‌టీయూకే రహదారి విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చాం. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు అదనపు కొమ్మల తొలగింపునకు అనుమతులిచ్చాం. తొలగింపు దాదాపుగా పూర్తయింది. అనివార్యమైతే తప్ప తొలగింపునకు అనుమతులివ్వడం లేదు. అయితే అవసరాన్ని అనుసరించి ఒరిగి వేలాడుతున్న కొమ్మలను మాత్రమే తొలగించి రహదారి మార్గాన్ని విశాలం చేశాం.
– టీవీ సిరల్, ఉద్యానవన సహాయ సంచాలకుడు, మున్సిపల్ విభాగం

ప్రణాళిక, పట్టుదలతోనే విజయాలు సాధ్యం

- కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రణాళిక, పట్టుదలతోనే విజయాలు సాధ్యమవుతాయని కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం సివిల్ సర్వీస్ పరీక్షపై అవగాహనతో పాటు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ సివిల్స్‌కు సన్నద్ధమయ్యేవారు ముఖ్యంగా పాత పరీక్ష పేపర్లతో పాటు సీనియర్ల అనుభవాలు తప్పకుండా తెలుసుకోవాలని సూచించారు. పేదరికం స్థాయి నుంచి సివిల్స్ ఏ విధంగా సాధించారో వారి జీవిత విశేషాలు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా స్ఫూర్తిదాయకంగా వివరించారు. మత్తు పదార్థాల వాడకంతో భవిష్యత్‌లో కలిగే నష్టాలను తెలియజేశారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ ద్వారా ఏవిధంగా చర్యలు తీసుకుంటుందో వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం ఆదిత్య డిగ్రీ కళాశాలలో కళాశాల కో–ఆర్డినేటర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అధ్యక్షతన ఇదే అంశంపై నిర్వహించారు. కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు.

షేర్‌వాల్‌తో ఇళ్ల నిర్మాణం

- తక్కువ ఖర్చుతో మంచి నాణ్యత
- లబ్ధిదారులను ఒప్పించండి
- అధికారులను కోరిన ఎమ్మెల్యే ద్వారంపూడి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో కమిషనర్ తదితరులు

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో షేర్‌వాల్ టెక్నాలజీ ద్వారా ఇళ్ల నిర్మాణం జరిగేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. శనివారం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, గృహ నిర్మాణశాఖాధికారులతో కలసి లే అవుట్‌ను సందర్శించారు. షేర్‌వాల్ టెక్నాలజీతో నిర్మించిన రెండు నమూనా ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ పూర్తి కాంక్రీట్‌తో జరిగే ఈ నిర్మాణం తక్కువ ఖర్చుతో వేగంగా పూర్తవుతుందన్నారు. ఇప్పటికే సామర్లకోట, పెద్దాపురం, విశాఖ వంటి ప్రాంతాల్లో ఈ టెక్నాలజీ ద్వారా ఇళ్ల నిర్మాణం విజయవంతంగా జరిగిందన్నారు. రూ.3.6 లక్షలు ఖర్చు అయ్యే ఇంటి నిర్మాణానికి షేర్‌వాల్ ద్వారా రూ.3 లక్షలకే పూర్తి అవుతుందన్నారు. తక్కువ ఖర్చుతో పాటు పూర్తి నాణ్యత ఉంటుందని, ఇళ్లు వేగంగా పూర్తవుతాయన్నారు. ఈ వాస్తవాలను లబ్ధిదారులకు అర్థమయ్యేలా వివరించి ఆ విధానంలో ఇళ్లు కట్టుకునేలా ఒప్పించాలని సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమంగా ఉన్న గృహ నిర్మాణాలపై ఆయా శాఖలు, కాంట్రాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీరి వెంట హౌసింగ్ డీఈ సత్యనారాయణ రెడ్డి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహకల్పలో మరిన్ని మౌలిక వసతులు

రాజీవ్ గృహకల్పలోని హనుమాన్ నగర్ ప్రాంతంలో రహదారులు, డ్రైనేజీల వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి రఘు, జితేంద్రసింగ్, మాకిరెడ్డి పద్మ, కోనాడ దుర్గాప్రసాద్, పరుశురామ్ తదితర నాయకుల విజ్ఞప్తి మేరకు ఆయన శనివారం రాజీవ్ గృహకల్ప ప్రాంతాన్ని సందర్శించారు. స్థానిక సమస్యలను అక్కడి ప్రజలు, నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్వరమే అక్కడ రహదారులు ,డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల పునఃప్రతిష్ఠ

- పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబు



గురజనాపల్లిలో హోమం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

కరప: మండలం గురజనాపల్లిలో ఆధునీకరించిన షిరిడీ సాయిబాబా మందిరంలో శనివారం కోదండ రామ, మహాగణపతి, సరస్వతి, దత్తాత్రేయస్వామి, సమర్థసద్గురు సాయినాథుని విగ్రహాల పునః ప్రతిష్ఠ భక్తి, శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్ ఆధ్వర్యంలో కాజులూరు మండలం దుగ్గుదర్రు వాస్తవ్యులు బ్రహ్మశ్రీ పూజ్యం నాగేశ్వరరావుశర్మ, అర్చకులు పుల్లేటికుర్తి అచ్యుతరామశాస్త్రి శైవాగమపద్ధతిలో త్రయాహ్నిక దీక్షతో ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠ, శిఖర కలశ స్థాపన చేశారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, వెంకట సత్యవేణి దంపతులు, కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు పాల్గొని పూజలు చేసి దేవతా మూర్తులను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. గురజనాపల్లి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని, స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఉత్సాహంగా జిమ్నాస్టిక్స్ పోటీలు

- అండర్ 14 బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో విశాఖ
- బాలుర విభాగంలో గుంటూరు
- ఆల్‌రౌండ్ చాంప్స్‌గా సత్తా చాటిన గుంటూరు



జిమ్నాస్టిక్స్ పోటీలలో పేరలల్ బార్ విన్యాసంలో పోటీ పడుతున్న క్రీడాకారుడు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14, 17, 19 ఆధ్వర్యంలో జిల్లా క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న 67వ పాఠశాల క్రీడా సమాఖ్య అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. శనివారం అండర్–14, 17 బాల బాలికల రిథమిక్ ఆర్టిస్టిక్ పోటీలు నిర్వహించారు. అండర్–14లో విశాఖ 68.25 పాయింట్లతో బాలికల విభాగంలో ప్రథమస్థానం, ద్వితీయస్థానంలో వైఎస్సార్ కడప 62.55 పాయింట్లతో, తృతీయస్థానంలో గుంటూరు 60.75 పాయింట్లతో నిలిచాయి. అండర్–14 బాలుర విభాగంలో గుంటూరు 114 పాయింట్లతో ప్రథమ, విశాఖ 90.70 పాయింట్లతో ద్వితీయ, తూర్పుగోదావరి 78.10 పాయింట్లతో తృతీయస్థానం సాధించాయి. ఆల్ రౌండ్ చాంపియన్ షిప్‌లో గుంటూరు ప్రథమ, తూర్పు గోదావరి ద్వితీయ, వైఎస్సార్ కడప తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. టోర్నీ పరిశీలకునిగా పూర్ణచంద్రరావు, శ్రీనివాస్ వ్యవహరించారని ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. పోటీల నిర్వహణలో హెచ్ఎంలు టీఈఎస్ రంగారావు, శ్రీను, పట్టాభిరామ్, మాచార్రావ్, సురేష్, చంద్రవతి, సువర్చల, భానుమతి సహకారం అందించారు.

పంచారామాలకు ఆర్టీసీ సర్వీసులు

- కాకినాడ డిపో మేనేజర్ మనోహర్



డిపో మేనేజర్ మనోహర్

కాకినాడ: కార్తీకమాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఏపీఎస్ ఆర్టీసీ స్థానిక డిపో మేనేజర్ ఎంవీఎస్ మనోహర్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 18, 19, 25,26, డిసెంబర్ 2, 3, 9,10 తేదీల్లో ఈ బస్సులు నడుస్తాయన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని పంచారామక్షేత్రాలన్నింటినీ దర్శించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా తేదీల్లో ప్రత్యేక బస్సులు రాత్రి 8 గంటలకు కాకినాడలో బయలుదేరి పంచారామ క్షేత్రాల దర్శనం అనంతరం మరుసటి రోజు రాత్రి 8 గంటలకు కాకినాడ చేరుకుంటాయన్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌కు రూ.860, అల్ట్రా డీలక్స్‌కు 1060, సూపర్‌లగ్జరీ బస్సుకు రూ.1100 చొప్పున బస్ చార్జీలు నిర్ణయించామన్నారు. బస్సును పూర్తిగా కావాలనుకుంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే శ్రీశైలం క్షేత్రం దర్శనానికి, శబరిమలైకి కూడా అద్దె ప్రాతిపదికన కానీ, టిక్కెట్ ప్రాతిపదికన కానీ బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. వీటికి ఆర్టీసీ రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందన్నారు. మరిన్ని వివరాలకు 73829 10658, 73829 10778, 73829 10869 నెంబర్లను సంప్రదించవచ్చునన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాధికార యాత్రను విజయవంతం చేయండి

- వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు సత్తిబాబు



కరపలో సామాజిక సాధికార యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కరప: సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని మండల బీసీ నాయకుడు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు కోరారు. స్థానిక చిరంజీవి కళ్యాణమండపంలో శనివారం జరిగిన వైఎస్సార్ సీపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సామాజిక న్యాయం జరుగుతోందని, దానికి నిదర్శనం మంత్రివర్గంలో, వివిధ నామినేషన్ల పదవులు కట్టబెట్టడంలో మూడు వంతుల్లో రెండు వంతులు బీసీలకు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించడమేనన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో జరిగే సామాజిక సాధికార యాత్ర గురించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి, ఆ రోజు బస్సులలో, ఆటోలలో, బైక్ ర్యాలీగా తరలివచ్చి విజయవంతంచేసేందుకు పార్టీశ్రేణులు, నాయకుల, కార్యకర్తలు కృషిచేయాలని సత్తిబాబు పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి జనం తరలివచ్చేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు చైతన్యపరచాలన్నారు. ఈ సందర్భంగా సామాజిక సాధికార యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, మండల ఎస్సీ నాయకులు సాదే లోహిదాస్, మార్నె వెంకటరమణ, వజ్రపు కామేశ్వరరావు, మండల బీసీ నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, వాసంశెట్టి శ్రీనుబాబు, వాసంశెట్టి రామారావు, పైలా గోవిందు, జవ్వాది సతీష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలూ తరలిరావాలి

కాకినాడ రూరల్: సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ గోపుశెట్టి పద్మజ, బాబ్జీ దంపతులు పిలుపు ఇచ్చారు. సర్పవరం జంక్షన్‌లో సోమవారం జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలకు పిలుపు ఇచ్చారు. ఈ మేరకు కొవ్వాడలోని నివాసంలో శనివారం మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే కన్నబాబు అన్ని వర్గాల వారికి అండగా ఉంటూ ముందుకు సాగుతున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని వర్గాల వారు పాల్గొనాలని కోరారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- 30 మందికి కుట్టు మెషీన్ల పంపిణీ



కుట్టు మెషీన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు

కాకినాడ: కుట్టు శిక్షణ ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చునని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పరలోపేట స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కాలనీలో స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సహకారంతో రక్షణ పెంతకోస్తు ప్రార్థనా మందిరంలో 30 మంది మహిళలకు శనివారం కుట్టు మెషీన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కుట్టు శిక్షణలో తర్ఫీదు పొందడం వల్ల స్వయం ఉపాధితో పాటు కుటుంబ పోషణలో కూడా మహిళలు చేదోడు వాదోడుగా నిలవచ్చునన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ స్వర్ణలత, పాస్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విడోస్ హోమ్ ఆధ్వర్యంలో..

బోట్‌క్లబ్: స్థానిక విడోస్‌హోమ్ ఆధ్వర్యంలో మూడు నెలలుగా కుట్టు శిక్షణ అందించి శనివారం వితంతువులకు ఉచితంగా కుట్టుమెషీన్లు అందించారు. 1886లో స్థాపించిన విడోస్ హోమ్ ఎందరికో ఆసరాగా ఉందని, ప్రస్తుతం వితంతువులకు శిక్షణ ఇచ్చి వారు కుటుంబాన్ని పోషించుకునేలా ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. విడోస్ హోమ్ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ పైండా రామకృష్ణారావు మాట్లాడుతూ మూడు నెలలుగా నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చామని, వీరిలో నలుగురికి ఉచితంగా కుట్టు మెషీన్లు అందించామన్నారు. మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్, విడోస్ హోమ్ సిబ్బంది నాగబాబు పాల్గొన్నారు.

ఓటరు శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



నడకుదురు హైస్కూలులో ఓటర్ల నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ కిశోర్



ఓటరు ప్రత్యేక నమోదు కేంద్రాన్ని సందర్శించిన ఈఆర్వో నాగ నరసింహారావు

కాకినాడ రూరల్: ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను నియోజకవర్గ ఈఆర్వో ఇ.కిశోర్ సందర్శించారు. రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహిస్తుండడంతో మండలంలోని ఇంద్రపాలెంలో శనివారం ఆయన పర్యటించారు. పలు పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదును పరిశీలించి, బీఎల్‌ఓలకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల మార్పులు, చేర్పులు అభ్యంతరాల స్వీకరణకు, యువ ఓటర్ల నమోదుకు శిబిరాలలో అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఓటర్ల జాబితా శిబిరాల వద్ద అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కరపలో..

కరప: అలాగే కరప మండలం నడకుదురు హైస్కూలులో ఏర్పాటుచేసిన శిబిరాన్ని కూడా ఆయన సందర్శించి, ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో కొత్త ఓటరుగా తమ పేరును నమోదు చేయించుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్ఐ పేపకాయల మాచరావు, మండల సర్వేయర్ ఇ.రామకృష్ణ, బీఎల్‌ఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన కమిషనర్

కాకినాడ: నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు శనివారం నగరంలోని పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. శ్రీనగర్, గొడారి గుంట ప్రాంతాల్లో జరుగుతున్న ఓటరు ప్రత్యేక నమోదు కేంద్రాలకు వెళ్లి అక్కడ జరుగుతున్న ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని బీఎల్‌వోలు, ఇతర అధికారులను ఆదేశించారు. ఆదివారం కూడా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని ఈఆర్వో నాగనరసింహారావు చెప్పారు. ఆయన వెంట ఏఈఆర్వో, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ డీవీ మురళికృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

జాతీయ యోగా పోటీలకు ఎంపిక



యోగా ప్రదర్శనలో యశ్వంత్

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న కిలారి యశ్వంత్ జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తాళ్లూరి వైకుంఠం శనివారం ఈ విషయం తెలిపారు. ఈ నెల 1 నుంచి మూడో తేదీ వరకూ పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో యశ్వంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడని వివరించారు. ఇతడు వచ్చే నెల త్రిపురలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. యశ్వంత్‌ను ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు అభినందించారు.